క్లుప్తంగా

కాలువల్లో పూడిక తీత



పూడిక తీయిస్తున్న మున్సిపల్ కమిషనర్

మందమర్రిరూరల్: మున్సిపాలిటీ పరిధిలోని నార్లాపూర్‌లో మురికి కాలువల్లో పూడిక నిండి ఉందని, నీటి నిలువలు ఏర్పడి ఇబ్బంది అవుతుందని గత శనివారం 'సాక్షి' ఆధ్వర్యంలో నిర్వహించిన 'కమిషనర్ ఫోన్ ఇన్' కార్యక్రమంలో సత్యనారాయణ మున్సిపల్ కమిషనర్‌తో మాట్లాడారు. స్పందించిన మున్సిపల్ కమిషనర్ వెంకటేశ్వర్లు శానిటరీ ఇన్‌స్పెక్టర్ శ్యాంసుందర్‌తో కలిసి నార్లాపూర్ వెళ్లి అక్కడి పరిస్థితిని ప్రత్యక్షంగా సమీక్షించి, కాలువలన్నింటిలోని పూడికను దగ్గరుండి తీయించారు. దీంతో సత్యనారాయణతో పాటు నార్లాపూర్ ప్రజలు 'సాక్షి'కి కృతజ్ఞతలు తెలిపారు.

సాక్షి ఎఫెక్ట్..

నాణ్యమైన విద్యుత్ సరఫరాకు కృషి

నస్పూర్: నాణ్యమైన విద్యుత్ సరఫరాకు కృషి చేస్తున్నామని ఎస్‌ఈ శ్రావణ్ కుమార్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. వినియోగదారులకు నాణ్యమైన విద్యుత్ అందించేందుకు మంచిర్యాల సర్కిల్‌లో 48 కెపాసిటర్ బ్యాంకులు ఏర్పాటు చేశామని, మరో నాలుగు త్వరలో ఏర్పాటు చేస్తామని పేర్కొన్నారు. వీటి వల్ల విద్యుత్ సరఫరాలో ఓవర్ లోడ్ కాకుండా నియంత్రణ జరుగుతుందని తెలిపారు.

పోస్టర్ ఆవిష్కరణ

జన్నారం/మందమర్రిరూరల్/దండేపల్లి: రాష్ట్ర ఫొటో, వీడియో గ్రాఫర్స్ సంక్షేమ సంఘం, ఫొటో టెక్‌ల సంయుక్త ఆధ్వర్యంలో ఈ నెల 26 నుంచి 28 వరకు హైదరాబాద్‌లో 'మన ఫొటో గ్రాఫర్ల పండగ' కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు జిల్లా ఫొటో, వీడియో గ్రాఫర్ల వెల్ఫేర్ అసోసియేషన్ జిల్లా ప్రధాన కార్యదర్శి రవీందర్ తెలిపారు. ఇందుకు సంబంధించిన ఫొటో ట్రేడ్ ఎక్స్ పోస్టర్‌ను దండేపల్లి మండలంలోని మేదరిపేటలో, జన్నారంలో మంగళవారం ఆయన ఆవిష్కరించారు. మందమర్రిలో ఎంపీడీవో రాజేశ్వర్ ఫొటో, వీడియోగ్రాఫర్స్ కలిసి మంగళవారం ఫొటో ట్రేడ్ ఎక్స్ పోస్టర్లను ఆవిష్కరించారు. కార్యక్రమంలో ఫొటో, వీడియోగ్రాఫర్స్ పాల్గొన్నారు.

కార్యదర్శుల బదిలీ

నెన్నెల: మండల వ్యాప్తంగా 9మంది పంచాయతీ కార్యదర్శులను బదిలీ చేస్తూ జిల్లా కలెక్టర్ కుమార్‌దీపక్ మంగళవారం ఉత్తర్వులు జారీ చేసినట్లు ఎంపీడీవో దేవేందర్‌రెడ్డి, ఎంపీవో శ్రీనివాస్ తెలిపారు. ఏడుగురికి నెన్నెల మండలంలోనే స్థానచలనం కాగా మరో ఇద్దరు కార్యదర్శులు బెల్లంపల్లి మండలానికి బదిలీ అయ్యారు. కార్యదర్శి పద్మనాభం నందులపల్లి పంచాయతీ నుంచి గన్‌పూర్ పంచాయతీకి బదిలీ అయ్యారు. ఎ.శ్రీలత గన్‌పూర్ నుంచి నందులపల్లికి, ఎస్.సతీష్‌కుమార్ ఆవుడం నుంచి లింగాపూర్(బెల్లంపల్లి), సి.హెచ్.సతీష్ గుండ్ల సోమారం నుంచి నార్వాయిపేట, లక్ష్మీ నార్వాయిపేట నుంచి గంగారాం పంచాయతీకి, ఎం.రంజిత్ గొల్లపల్లి నుంచి గుండ్ల సోమారం పంచాయతీకి, వేణుగోపాల్‌ను గంగారం నుంచి చిన్నవెంకటాపూర్‌కు, జి.శ్రీలత చిన్నవెంకటాపూర్ నుంచి బుచ్చయ్యపల్లి(బెల్లంపల్లి), రాజేష్ నాగారాం(హాజీపూర్) నుంచి ఆవుడంకు బదిలీ అయినట్లు ఎంపీడీవో పేర్కొన్నారు.

అప్రమత్తంగా ఉండాలి

వేమనపల్లి: భారీ వర్షాలతో పాటు ప్రాణహితకు వరద తీవ్రత పెరుగుతుండటంతో లోతట్టు గ్రామాల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ఎంపీడీవో దేవేందర్‌రెడ్డి అన్నారు. నీల్వాయి గ్రామ శివారులో ఇటీవల భారీ వర్షాలకు తెగిన మామడ కల్వర్టును, వర్షాలకు కూలిపోయిన ఇళ్లను మంగళవారం పరిశీలించారు. ఎలాంటి ఇబ్బందులు ఉన్నా స్థానిక పంచాయతీ కార్యదర్శికి సమాచారం ఇవ్వాలని కోరారు.

మున్సిపల్‌లో కొనసాగుతున్న బదిలీలు

మంచిర్యాలటౌన్: మున్సిపాలిటీలో వివిధ విభాగాల్లోని హోదాల్లో పనిచేస్తున్న ఉద్యోగుల బదిలీలు, వారి స్థానంలో కొత్తవారి రాక ప్రక్రియ కొనసాగుతోంది. మంగళవారం మంచిర్యాల మున్సిపల్ టౌన్ ప్లానింగ్ అధికారిగా ఉన్న సత్యనారాయణను నిజామాబాద్ కార్పొరేషన్‌కు బదిలీ చేయగా, ఆయన స్థానంలో జీహెచ్‌ఎంసిలో టౌన్ ప్లానింగ్ అధికారిగా ఉన్న బి.సంపత్‌ను నియమించారు. మందమర్రి మున్సిపాలిటీలో టౌన్ ప్లానింగ్ సూపర్‌వైజర్‌గా పనిచేస్తున్న బి.రాజ్‌కుమార్‌ను మంచిర్యాల మున్సిపల్ టీపీఎస్‌గా బదిలీ చేశారు. రామగుండం కార్పొరేషన్ టీపీఎస్‌గా పనిచేస్తున్న బి.శ్యాంసుందర్‌ను మంచిర్యాల మున్సిపాలిటీకి బదిలీ చేశారు.

చేతులెత్తేసిన సింగరేణి?

- గనులు మూతపడడంతో కార్మిక వాడలను పట్టించుకోని వైనం..
- సమస్యలతో సతమతమవుతున్న కార్మిక కుటుంబాలు
- ప్రధాన, అంతర్గత రోడ్లను పట్టించుకునే నాథుడే కరువు
- ఎక్కడికక్కడే చెత్త.. అధ్వానంగా డ్రెయినేజీ వ్యవస్థ
- కనీసం వీధి దీపాలు కూడా ఏర్పాటు చేయని యాజమాన్యం
- ఇదీ రామకృష్ణాపూర్ పట్టణ పరిస్థితి..

రామకృష్ణాపూర్ పట్టణ పరిస్థితి పట్టణ పరిస్థితి అగమ్యగోచరంగా తయారైంది. గనులు మూతపడుతుండడంతో కార్మిక కుటుంబాలు సమస్యలతో సతమతమవుతున్నాయి. కార్మిక వాడలను పట్టించుకునే వారే లేకపోవడంతో ప్రధాన, అంతర్గత రోడ్లు అధ్వానంగా తయారయ్యాయి. చెత్త ఎక్కడికక్కడే పేరుకుపోగా, డ్రెయినేజీలు మురికి కూపాలుగా మారాయి. మరోవైపు అందుబాటులో లేని వీధి దీపాలు అంధకారాన్ని తలపిస్తున్నాయి. అంతిమంగా పట్టణ మనుగడ ప్రశ్నార్థకంలో పడింది. పట్టణంలోని ఏ ఒక్క వార్డులోనూ పారిశుధ్య నిర్వహణ సక్రమంగా లేదు. అసలు పారిశుధ్య నిర్వహణ బాధ్యతల నుంచి సంస్థ తప్పుకునే సూచనలే కానవస్తున్నాయి. గనులు, డిపార్ట్‌మెంట్ల మూసివేతకే మొగ్గు చూపుతున్న అధికారులు మౌలిక సదుపాయాల కల్పన విషయంలోనూ ముఖం చాటేస్తున్నారనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. బొగ్గు గనుల మూసివేతతో బోసిపోయి కనీస సౌకర్యాల లేమితో సతమతమవుతున్న నేపథ్యంలో 'సాక్షి' అందిస్తున్న ప్రత్యేక కథనం..

– రామకృష్ణాపూర్



ఆర్‌కేపీ కార్మికవాడల్లో శిథిలమైన రోడ్డు

అస్తవ్యస్తంగా నీటి సరఫరా..

పట్టణంలో మంచినీటి సరఫరా అస్తవ్యస్తంగా ఉంది. ఎప్పుడో వేసిన పైపులైన్ల ద్వారానే నేటికీ నీటి సరఫరా జరుగుతోంది. కొత్త పైపులైన్ల జాడే లేకుండా పోయింది. దీంతో పట్టణంలోని పలు కాలనీల్లో మురికి నీరు సరఫరా అవుతోంది. ఇంటింటికీ మిషన్ భగీరథ పథకం అంతంతమాత్రంగానే ఉంది. పూర్తిస్థాయిలో రక్షిత మంచినీటి సరఫరా జరగడం లేదు. ఇక వీధి దీపాల విషయానికొస్తే పట్టణ వ్యాప్తంగా కార్మికవాడల్లో అంధకారమే తచ్చాడుతోంది. దీర్ఘకాలంగా ఈ రెండు సమస్యలు ప్రధానంగా పట్టిపీడిస్తున్నాయి. ఒక విధంగా చెప్పాలంటే కాలనీల్లో అభివృద్ధి కానరాని పరిస్థితులు నెలకొన్నాయి. మేజర్ గ్రామపంచాయతీ నుంచి మున్సిపాలిటీగా అప్‌గ్రేడ్ అయినప్పటికీ అభివృద్ధి ఛాయలు మచ్చుకు శూన్యమే అవుతున్నాయి.



రోడ్డుపైనే చెత్తాచెదారం

డ్రెయినేజీల సొగసు చూడతరమా..?

మురికి కాలువల్లో ఎక్కడికక్కడ మురికి నీరు చేరి మురికి కూపాలను మరిపిస్తున్నాయి. ఏ కాలనీలో చూసినా ఆశించిన విధంగా డ్రెయినేజీలు లేవు. పట్టణానికి శాశ్వత డంపింగ్ యార్డు అనేది లేక చెత్త ఎక్కడపడితే అక్కడే దర్శనమిస్తోంది. కనీసం చెత్త కుండీలు లేని దుస్థితి పట్టణానికి పట్టిందంటే ఎవరికి చెప్పుకునేది. కాలనీ ప్రాంతాల్లో పిచ్చిమొక్కలు ఏపుగా పెరిగి చిట్టడవిలా మారాయి. పర్యవసానంగా పాములు, విష కీటకాలు ఎడాపెడా తిరుగుతున్నాయి. ఇలా ఏ రంగాన్ని తీసుకున్నా అభివృద్ధి కానరాని పరిస్థితి. అటు సింగరేణి ఇటు మున్సిపాలిటీ అధికారుల నిర్లక్ష్య వైఖరితో దయనీయ స్థితిలో రామకృష్ణాపూర్ పట్టణం దర్శనమిస్తోంది. ఇన్ని వైఫల్యాల మూలంగానే పట్టణ ఉనికి ప్రమాదంలో పడిందనే ఆవేదన ప్రజల్లో వ్యక్తమవుతోంది. సమస్యల సుడిగుండంలో చిక్కుకున్న రామకృష్ణాపూర్‌కు పూర్వ వైభవం రాకున్నా.. కనీస మౌలిక సదుపాయాల గురించి ఆశించిన బాటలు పడాలని ప్రజలు కోరుకుంటున్నారు.

రోడ్లయితే మరీ దారుణం...!

రామకృష్ణాపూర్ పట్టణంలో ప్రధాన, అంతర్గత రోడ్లు మరీ దారుణంగా దర్శనమిస్తున్నాయి. క్యాతనపల్లి మున్సిపాలిటీ పరిధిలో మొత్తం 22వార్డులుండగా సింగరేణి సంస్థ అధీనంలోనే 18వార్డుల వరకు ఉన్నాయి. అయితే ఏరియా ఉన్నతాధికారులు రోడ్ల విషయంలో చొరవ తీసుకోవటం లేదని ప్రజలు వాపోతున్నారు. కొన్ని కాలనీల్లో ఎన్నో ఏళ్ల క్రితం వేసిన రోడ్లే ఇంకా కనిపిస్తున్నాయి. గనులు, డిపార్ట్‌మెంట్ల మూసివేతతో ఎలాగు పట్టణ పర్యవేక్షణ బాధ్యతల నుంచి తప్పుకుంటున్నామన్న ఆలోచననా లేక మరేదైనా కావొచ్చుగానీ ఏరియా అధికారులు కనీస మరమ్మతులకు సైతం మొగ్గుచూపకపోవడం తీవ్ర విమర్శలకు తావిస్తోంది.

సమాచారం

ఐటీఐ ప్రిన్సిపాల్ చందర్ వరంగల్‌కు బదిలీ

మంచిర్యాలఅర్బన్: స్థానిక ప్రభుత్వ ఐటీఐ ప్రిన్సిపాల్‌గా విధులు నిర్వర్తించిన ప్రిన్సిపాల్ చందర్ వరంగల్‌కు బదిలీయ్యారు. ఐటీఐ ఇన్‌చార్జి ప్రిన్సిపాల్‌గా రమేష్‌ను నియమించారు. ఐటీఐలో మంగళవారం ఏర్పాటు చేసిన కార్యక్రమంలో బదిలీపై వెళ్తున్న చందర్‌ను ఘనంగా సన్మానించారు.

25న ఎస్‌జీఎఫ్ సమావేశం

మంచిర్యాలఅర్బన్: స్థానిక బాలికల ఉన్నత పాఠశాల ఆవరణలో ఈ నెల 25న ఎస్‌జీఎఫ్ సమావేశం నిర్వహించనున్నట్లు డీఈవో యాదయ్య తెలిపారు. జిల్లాలోని ఆయా పాఠశాలల హెచ్‌ఎం, ప్రిన్సిపాల్, పీఈటీ, పీడీలు హాజరుకావాలన్నారు.

27, 28న ఏబీపీపీ రాష్ట్రస్థాయి సమావేశం

మంచిర్యాలఅర్బన్: ఖమ్మంలో ఈ నెల 27న అఖిల భారతీయ అయ్యప్ప ధర్మ ప్రచారసభ (ఏబీపీపీ) సమావేశం జరుగుతుందని ఏబీపీపీ రాష్ట్ర అధ్యక్షుడు తిరుమల్‌రావు తెలిపారు. 28న జాతీయ కార్యవర్గ సమావేశం ఉంటుందని, ఏబీపీపీ ఆధ్వర్యంలో నిర్వహించే అయ్యప్ప స్వామి మహాపడిపూజా మహోత్సవాలపై చర్చించనున్నట్లు తెలిపారు. ఏబీపీపీ సభ్యులు, భక్తులు హాజరుకావాలన్నారు.

నేడు వృత్తి శిక్షణ తరగతులు ప్రారంభం

మందమర్రిరూరల్: సింగరేణి సేవా సమితి ఆధ్వర్యంలో నిర్వహించే వృత్తి శిక్షణా కోర్సులను బుధవారం ఏరియాలోని సీఈఆర్ క్లబ్‌లో ఉదయం తొమ్మిదిన్నరకు ప్రారంభించనున్నట్లు ఏరియా సేవా సమితి అధ్యక్షురాలు, జీఎం సతీమణి సవిత మనోహర్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. శిక్షణ పూర్తి చేసుకున్న అభ్యర్థులకు ధృవ పత్రాలు అందజేయనున్నట్లు తెలిపారు.

గుడిరేవులో 'బడిబాగులో నేను'

దండేపల్లి: మండలంలోని గుడిరేవు ప్రాథమిక పాఠశాలలో 'బడిబాగులో నేను' అనే వినూత్న కార్యక్రమానికి పాఠశాల హెచ్‌ఎం బొలిశెట్టి బుచ్చన్న మంగళవారం శ్రీకారం చుట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. బడి బాగుపడి ఉన్నత లక్ష్యాలను చేరాలంటే ఏం చేయాలో, ఆలోచన, అనుభవాలను గ్రామస్తులు, పెద్దలు, యువకులు, పూర్వ విద్యార్థులు తమ సలహాలు, సూచనలు తెలియజేయాలన్నారు. బడిబాగుకు, సహాయ సహకారాలు అందించాలన్నారు. కార్యక్రమ ప్రారంభంలో భాగంగా పాఠశాల పూర్వ విద్యార్థి రాజు రూ.5వేలు, దండేపల్లికి చెందిన రాజన్న రూ.3వేలు, రెడ్డి రూ.వెయ్యి, ధర్మపురికి చెందిన మహేష్ రూ.వెయ్యి చొప్పున విరాళాలు అందించారు. వీటిని బడిబాగుకు వినియోగిస్తామని హెచ్‌ఎం చెప్పారు. కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయురాలు కల్పన, అమ్మఆదర్శ పాఠశాల కమిటీ చైర్మన్ స్వరూప పాల్గొన్నారు.



ప్రారంభోత్సవంలో హెచ్‌ఎం, ఉపాధ్యాయులు

ఘనంగా బీఎంఎస్ ఆవిర్భావ వేడుకలు

శ్రీరాంపూర్/కాసిపేట/జైపూర్: బీఎంఎస్ 70వ ఆవిర్భావ దినోత్సవాన్ని శ్రీరాంపూర్, మందమర్రి ఏరియా కాసిపేట-2 గనిపై, జైపూర్ సింగరేణి థర్మల్ పవర్ ప్లాంట్ ప్రధాన గేటు ఎదుట ఘనంగా నిర్వహించారు. పలు గనుల డిపార్టుమెంట్ల వద్ద బీఎంఎస్ నేతలు, అనుబంధ కార్మిక సంఘాల ఆధ్వర్యంలో జెండాలు ఎగురవేశారు. కార్మికులకు ఎల్లవేళలా అందుబాటులో ఉంటూ సేవలు చేస్తున్న సంఘం బీఎంఎస్సేనని పలువురు పేర్కొన్నారు. సింగరేణిలో కార్మికుల హక్కుల పరిరక్షణకు, కొత్త హక్కుల కోసం నిరంతరం బీఎంఎస్ పోరాడుతుందన్నారు. కార్యక్రమాల్లో శ్రీరాంపూర్‌లో ఆ యూనియన్ శ్రీరాంపూర్ బ్రాంచ్ ఉపాధ్యక్షుడు నాతాడి శ్రీధర్ రెడ్డి, ఆ యూనియన్ కేంద్ర ఉపాధ్యక్షులు చాట్ల అశోక్, బ్రాంచ్ కార్యదర్శి ఈశ్వర చారి, కేంద్ర కార్యదర్శులు రాగం రాజేందర్, ప్రభాకర్, కాసిపేటలో మందమర్రి ఏరియా సెక్రెటరీ ప్రదీప్‌కుమార్, సెంట్రల్ వైస్ ప్రెసిడెంట్ శ్రీనివాస్‌రాజు, ఏరియా ట్రెజరర్ రవీందర్, ఏరియా ఆర్గనైజింగ్ సెక్రెటరీ సంతోష్, జైపూర్‌లో ఆ సంఘం ప్రధాన కార్యదర్శి దుస్స భాస్కర్, ఎస్‌టీపీపీ ఉపాధ్యక్షుడు చిలకాని వెంకటేష్, ఆర్గనైజింగ్ కార్యదర్శి ఈగ సురేందర్, కార్యదర్శులు బోదకుంట శ్రీధర్, కళ్యాణం సతీష్, నాయకులు తదితరులు పాల్గొన్నారు.



శ్రీరాంపూర్‌లో జెండా ఆవిష్కరిస్తున్న నాయకులు

'రైతునేస్తం' అన్నదాతకు ఎంతో ఉపయోగం

మందమర్రిరూరల్/నెన్నెల: సాగు రైతులకు సలహాలు, సూచనలు ఇచ్చేందుకు ప్రభుత్వం ప్రవేశపెట్టిన రైతునేస్తం కార్యక్రమం అన్నదాతలకు ఎంతో ఉపయోగకరమని జిల్లా వ్యవసాయాధికారి కల్పన అన్నారు. నెన్నెల మండలంలోని చిత్తాపూర్ రైతువేదికలో మంగళవారం రైతునేస్తం వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొని మాట్లాడారు. ప్రతి మంగళవారం రైతువేదికల్లో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా రైతులకు శాస్త్రవేత్తలు పలు సూచనలు తెలియజేస్తారన్నారు. అనంతరం జోగాపూర్‌లో నమోదు చేసిన పంటల వివరాలను తనిఖీ చేశారు. మందమర్రి మండలంలోని శంకర్‌పల్లి జీపీ పరిధిలో గల సండ్రోన్ పల్లె రైతువేదికలో రైతుబీమాపై అవగాహన కల్పించారు.



మందమర్రిరూరల్: మాట్లాడుతున్న డీఏవో

మూడు రోజులుగా ముంపులోనే..



వేమనపల్లి: ప్రాణహిత నది ముంపు వరదలోనే 2500ఎకరాల పత్తి చేళ్లు మూడు రోజులుగా మునిగి ఉన్నాయి. కళ్లంపల్లి, ముక్కిడిగూడెం, జాజులపేట, సుంపుటం, వేమనపల్లి, కల్మలపేట, రాచర్ల, కేతన్‌పల్లి, ముల్కలపేట శివారులలో వరద పోటెత్తి ప్రవహిస్తోంది. మంగళవారం ఉదయం కొంచం తగ్గి, మళ్లీ ఉధృతమైంది. ముల్కలపేట-రాచర్ల గ్రామాల మధ్య రహదారితో పాటు సుంపుటం, అట్టలొర్రె, అంకన్నపేట ఒర్రె, ముక్కిడిగూడెం ముత్యాలమ్మగుడి వద్దకు వరద పోటెత్తింది. పుష్కరఘాట్‌తో పాటు ఎంచపాయకు రాకపోకలు నిలిచిపోయాయి. దిగువన గోదావరి నదిలో సైతం వరద పెరుగుతుండటం ఎగువన పెనుగంగా, వార్ధా నదుల నుంచి వరద పోటెత్తడంతో భారీ నష్టం కలుగుతోంది.

'తప్పుడు ప్రచారం మానుకోవాలి'

బెల్లంపల్లి: సామాజిక మాధ్యమాల్లో క్రైస్తవుల మనోభావాలు దెబ్బతీసేలా, మత విద్వేషాలు రెచ్చగొట్టే విధంగా జరుగుతున్న ప్రచారాన్ని వెంటనే ఆపాలని ఉత్తర తెలంగాణ పాస్టర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు ఎస్.స్యామేల్, సెక్రెటరీ మాథ్యూస్ ఎంజార్జ్ డిమాండ్ చేశారు. క్రిస్టియన్ మైనార్టీ వెల్ఫేర్ ఫైనాన్స్ కార్పొరేషన్ చైర్మన్ దీపక్ జాన్‌కు మంగళవారం వినతిపత్రం అందజేశారు.

అసెంబ్లీలో తీర్మానం చేయాలి

మందమర్రిరూరల్: రాష్ట్రంలోని నూతన బొగ్గు గనులను ఎలాంటి వేలం లేకుండా సింగరేణి సంస్థకు కేటాయించాలని అసెంబ్లీలో తీర్మానం చేసి, కేంద్రానికి పంపాలని టీబీజీకేఎస్ రాష్ట్ర డిప్యూటీ జనరల్ సెక్రెటరీ ఓ. రాజశేఖర్ మంగళవారం ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. సింగరేణిలో గతేడాది సంస్థకు వచ్చిన వాస్తవ లాభాలను వెంటనే ప్రకటించి, 35శాతం ఉద్యోగులకు పంచేలా కోల్‌బెల్ట్ ప్రాంత శాసనసభ్యులు అసెంబ్లీ సమావేశాలు జరుగుతున్నందునా చొరవ తీసుకోవాలని డిమాండ్ చేశారు.

నియామకం

చెన్నూర్: పట్టణ బీజేపీ యువమోర్చ అధ్యక్షుడిగా సుంకరి శ్రావణ్‌ను నియమిస్తూ బీజేపీ పట్టణ అధ్యక్షుడు జాడి తిరుపతి మంగళవారం నియామక పత్రం అందజేశారు.

టాయిలెట్ నిర్మాణ పనులు ప్రారంభం

సాక్షి ఎఫెక్ట్..

మందమర్రిరూరల్: పట్టణంలోని మార్కెట్ ఆర్టీసీ బస్టాండ్ ఆవరణలో ఆరు నెలల క్రితం శంకుస్థాపన చేసిన పబ్లిక్ టాయిలెట్ నిర్మాణ పనులు బేస్మెంట్, పిల్లర్స్ వరకు నిర్మించి పనులు ముందుకు సాగకపోవడంతో ఈ నెల 20న 'నత్తనడకన..' అనే శీర్షికన 'సాక్షి'లో ప్రచురితమైన కథనానికి మున్సిపల్ కమిషనర్ వెంకటేశ్వర్లు స్పందించారు. సంబంధిత కాంట్రాక్టర్‌కు పనులు ముమ్మరం చేయాలని, వీలైనంత త్వరగా పూర్తిచేయాలని ఆదేశించడంతో తిరిగి నిర్మాణ పనులు చేపట్టారు. దీంతో పట్టణ ప్రజలు 'సాక్షి'కి కృతజ్ఞతలు తెలిపారు.



కన్నాల హైవేపై యూటర్న్ మూసివేత

బెల్లంపల్లి: రోడ్డు ప్రమాదాలకు నిలయంగా మారి ప్రజల ప్రాణాలను బలితీసుకుంటున్న బెల్లంపల్లి శివారు కన్నాల పంచాయతీలోని తిరుమల హిల్స్ కాలనీ వద్ద ఏర్పాటు చేసిన యూటర్న్‌ను మూసివేసే చర్యలకు నేషనల్ హైవే అధికారులు ఉపక్రమించారు. ఎప్పటి మాదిరిగానే మంగళవారం యూటర్న్ వద్ద ట్రాక్టర్, కారు ఢీకొని ఇద్దరు తీవ్రంగా గాయపడి ప్రాణాపాయ స్థితిలో ఉన్నారు. దీంతో హైవే అధికారుల నిర్లిప్తతపై తీవ్ర విమర్శలు వచ్చాయి. ఎమ్మెల్యే గడ్డం వినోద్ హైవే అధికారులతో మాట్లాడి తక్షణమే యూటర్న్‌ను మూసివేయించాలని ఆదేశించడంతో యూటర్న్ వద్ద పోలీసు బందోబస్తు మధ్య తాత్కాలికంగా సిమెంట్ దిమ్మెలు ఏర్పాటు చేసి రాకపోకలు సాగించకుండా కట్టడి చేశారు. త్వరలోనే శాశ్వత పద్ధతిలో యూటర్న్‌ను మూసివేయనున్నట్లు సమాచారం.



యూటర్న్ వద్ద సిమెంట్ దిమ్మెలు ఏర్పాటు చేస్తున్న హైవే అధికారులు

'రుణమాఫీపై కొర్రీలు సరికాదు'


జన్నారం: కాంగ్రెస్ ప్రభుత్వం రైతులకు రుణమాఫీ చేస్తామని హామీ ఇచ్చి ఇప్పుడు నిబంధనల పేరుతో కొర్రీలు పెట్టడం సరికాదని సీపీఐ జిల్లా కార్యదర్శి వర్గసభ్యుడు ఖలిందర్ అలీఖాన్ డిమాండ్ చేశారు. మంగళవారం విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఏజెన్సీ ప్రాంతాల్లో తాతల కాలం నుంచి పట్టాలు లేకుండా భూములు సాగు చేసుకుంటూ బ్యాంకు రుణాలు పొందుతున్నారని, అలాంటి రైతులు రుణమాఫీకి అర్హత కోల్పోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. అనంతరం సీపీఐ మండల కార్యదర్శిగా దాసరి తిరుపతి, కన్వీనర్‌గా మామిడి విజయ్‌ను నియమించినట్లు తెలిపారు. సమావేశంలో నాయకులు చాడ పోశన్న, చాడ మహేందర్‌రెడ్డి, బియ్యాల రాజేశం, తదితరులు పాల్గొన్నారు.

సంస్థ లాభాలను వెంటనే ప్రకటించాలి

రామకృష్ణాపూర్: గత ఆర్థిక సంవత్సరానికి గాను సింగరేణి సంస్థకు వచ్చిన లాభాలను వెంటనే ప్రకటించాలని ఏఐటీయూసీ కేంద్ర కార్యదర్శి అక్బర్ అలీ డిమాండ్ చేశారు. మందమర్రి ఏరియాలోని ఆర్‌కే ఓసీలో మంగళవారం నిర్వహించిన గేట్ మీటింగ్‌లో ఆయన మాట్లాడారు. సింగరేణిలో నూతన గనుల ఏర్పాటుకు చొరవచూపాలని, అలాగే ఆర్‌కే ఓసీ ఎక్స్‌టెన్షన్ ప్రాజెక్టుకు త్వరగా అనుమతులు ఇప్పించాలని ఇటీవల కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డిని కలిసి విన్నవించినట్లు తెలిపారు. అనంతరం ఓసీ పిట్ కార్యదర్శిగా ఎన్నికైన రామకృష్ణ, అసిస్టెంట్ పిట్ కార్యదర్శిగా ఎన్నికైన రాజ్‌కుమార్‌లను సన్మానించారు.

సర్వీస్ రూల్స్ సాధిస్తాం

మంచిర్యాలఅర్బన్: దీర్ఘకాలికంగా అపరిష్కృతంగా ఉన్న ఉపాధ్యాయుల ఉమ్మడి సర్వీస్ రూల్స్ సాధించి తీరుతామని పీఆర్టీయూ టీఎస్ జిల్లా అధ్యక్షుడు ఇన్నారెడ్డి అన్నారు. బుధవారం మంచిర్యాల బాలుర ఉన్నత పాఠశాలలో సంఘ సభ్యత్వ నమోదు చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉమ్మడి సర్వీస్ రూల్స్ సాధన ద్వారా అర్హులైన స్కూల్ అసిస్టెంటు ఉపాధ్యాయులకు ఎంఈవో, డిప్యూటీ డీఈవో, జూనియర్ లెక్చరర్, డైట్ లెక్చరర్ పదోన్నతులకు మార్గం సుగమం అవుతుందన్నారు. సర్వీసు రూల్స్ సమస్యలపై ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డితో సంఘ బాధ్యులు సంప్రదించారన్నారు.



సభ్యత్వ నమోదు అందజేస్తున్న ఇన్నారెడ్డి

బురదతో అవస్థలు..!

బురదలోంచి నడుస్తూ వెళ్తున్న కేజీబీవీ సిబ్బంది



దండేపల్లి కస్తూర్బాకు వెళ్లే రోడ్డు కొద్ది దూరం బీటీ వేయకపోవడంతో చిన్నపాటి వర్షం పడితే చాలు, బురదమయం అవుతోంది. దీంతో ఈ రోడ్డుగుండా పాఠశాలకు వెళ్లే సిబ్బందితో పాటు, పెళ్లిమడుగు గిరిజనులు, పంట పొలాలు, చేలకు వెళ్లే రైతులు ఆది, గురు వారాల్లో పెద్దయ్య దేవుని వద్దకు వెళ్లే భక్తులు అనేక అవస్థలు పడుతున్నారు. బీటీ వేసి బురద కష్టాలు లేకుండా చూడాలని కోరుతున్నారు. – దండేపల్లి

వర్షాలకు భీమిని మండలంలోని వడాల ప్రాథమిక పాఠశాల ఆవరణలో బురద పేరుకుపోవడంతో విద్యార్థులు నానా అవస్థలు పడుతున్నారు. ప్రహరీ కూడా లేకపోవడంతో పశువులు సంచరిస్తున్నా యి. ఇప్పటికైనా అధికారులు స్పందించి బురద లేకుండా చూడాలని విద్యార్థుల తల్లిదండ్రులు కోరుతున్నారు. – భీమిని



ఆర్థిక సాయం

మంచిర్యాలటౌన్: జిల్లా కేంద్రానికి చెందిన ఫిట్‌నెస్ సెంటర్ ట్రైనీ సాయిచరణ్‌కు జాతీయ స్థాయిలో వెయిట్ లిఫ్టింగ్ పోటీల్లో పాల్గొనేందుకు అవకాశం రాగా మంగళవారం శ్రీనివాసం ఇన్‌ఫ్రా డెవలపర్స్ ఎండీ మార్క నవీన్ కుమార్ గౌడ్ రూ.25వేల ఆర్థిక సాయం అందించారు.